# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి

మంగళవారం 29 సెప్టెంబర్ 2026


## రికార్డు స్థాయిలో బాలాపూర్ గణేష్ హుండీ ఆదాయం

బాలాపూర్: బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించగా, మొత్తం రూ. 28,11,999 (ఇరవై ఎనిమిది లక్షల పదకొండు వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలు) ఆదాయం హుండీ కానుకల రావడం జరిగిందని ఉత్సవ సమితి కమిటీ అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి తెలిపారు. స్వామివారిపై అపారమైన భక్తి విశ్వాసాలతో తమ కానుకలను సమర్పించిన ప్రతి ఒక్క భక్తుడికి బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, భక్తులందరిపై బాలాపూర్ గణేష్ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.





## 'ప్రజావాణి'కి 9 అర్జీలు

**- నోడల్ అధికారి నాగవేణి సమక్షంలో గ్రీవెన్స్ డే**

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమానికి ప్రజల నుంచి 9 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీవో ఆవుల కిషన్ తెలిపారు. నోడల్ అధికారి నాగవేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చిన అర్జీల్లో మండల రెవెన్యూ కార్యాలయానికి (తహసీల్దార్) 6, మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కి 2, విద్యాశాఖకు 1 దరఖాస్తు వచ్చాయని వివరించారు. బాధితుల నుంచి స్వీకరించిన ఈ దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడానికి ఆయా శాఖలకు పంపించినట్లు సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆపన్నహస్తం

**- రూ.5 వేల నగదు అందజేత**

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన నిరుపేద జెల్ల పెద్దోళ్ల రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న జెల్ల పరమేష్ యువసేన ప్రతినిధులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యువసేన తరఫున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువసేన అధ్యక్షుడు జెల్ల పరమేష్, సభ్యులు కర్ణాకర్, మహేష్, నరేష్ ప్రసాద్, అంబాబాయి, నాగరాజు, కమలాకర్, నగేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.



## భూభారతిలో భూభాగోతం

**అమ్మలేదు.. రిజిస్ట్రేషన్ చేయలేదు.. అయినా మారిపోయిన పట్టా!**

**చల్లూరులో ముగ్గురు రైతుల 7.18 ఎకరాలు కబ్జా?**

**- తహసీల్దార్ ఆఫీస్ వద్ద బాధితుల ఆందోళన**

**గ్రీవెన్స్ డేలో తహసీల్దార్‌కు చల్లూరు రైతుల ఫిర్యాదు**

**తొలివెలుగు, రాజాపేట :** భూభారతి పోర్టల్‌లోని సాంకేతిక లొసుగులను ఆసరాగా చేసుకుని, అసలు యజమానులకు తెలియకుండానే వ్యవసాయ భూముల పట్టాలు మారిపోయిన సంచలన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలో వెలుగుచూసింది. చల్లూరు గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు చెందిన దాదాపు 7.18 ఎకరాల భూమి ఎలాంటి పాస్‌బుక్, డాక్యుమెంట్లు, ఆధారాలు లేకుండానే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరిట నమోదైంది. సాధారణంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పట్టాదారు పేరు మారాల్సి ఉండగా, ఎలాంటి స్లాట్ బుకింగ్ లేకుండానే భూభారతిలో పేరు మారిపోవడంతో గ్రామస్థులు షాక్‌కు గురయ్యారు. గ్రామానికి చెందిన బింగి మల్లయ్యకు చెందిన సర్వే నంబరు 319/ఆ లోని 1 ఎకరం 32 గుంటల భూమి ఆయనకు తెలియకుండానే బింగి కరుణాకర్ పేరిట నమోదైంది. చల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 402లో కేవలం ఒక గుంట భూమికి మాత్రమే స్లాట్ బుక్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోగా.. అదే రోజు 329/ఇ2 లోని 4.06 ఎకరాలు, 319 లోని 1.32 ఎకరాలు, 108 లోని 1.20 ఎకరాల భూమి (మొత్తం 7.18 ఎకరాలు) అక్రమంగా కరుణాకర్ పేరిట పట్టా అయినట్లు రైతులు తెలిపారు. ఎలాంటి లావాదేవీలు జరగకుండానే భూమి పట్టా ఎలా మారిందో తెలపాలని సోమవారం గ్రీవెన్స్ డేలో తహసీల్దార్ ఎదుట రైతులు నిరసన వ్యక్తంచేసి వినతిపత్రం అందజేశారు.




## చిగుర్ల లింగం కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

**- చంద్రపాల్ చిత్రపటానికి నివాళులర్పించిన నెల్లికంటి సత్యం**

**- సానుభూతి తెలిపిన సీపీఐ నాయకులు**

**తొలివెలుగు, రాజాపేట :** సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుర్ల లింగం తండ్రి, పీఏసీఎస్ డైరెక్టర్ చంద్రపాల్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సోమవారం రాజాపేట మండలం బేగంపేట గ్రామానికి చేరుకుని చంద్రపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిగుర్ల లింగంతో కొద్దిసేపు మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్సీ వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, స్థానిక సర్పంచ్ ఇండ్ల అనూష సుమన్, రైతు సంఘం నాయకులు పెరబోయిన బంగారి, మూల హరినాథ్, మూల పోచయ్య, ఒగ్గు కరుణాకర్, బహుపేట వెంకటయ్య, తారీగొప్పుల సిద్దులు, జెల్ల బాలరాజ్ తదితరులు ఉన్నారు.



తొలివెలుగు ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..



# రూ.3,56,555 పలికిన లడ్డు

**- 101 యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు**

**- లక్కీడ్రాలో స్కూటీ గెలుచుకున్న అనుష**

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రంలో 101 యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. ఏటా విశేష ప్రాముఖ్యత సంతరించుకునే 51 కేజీల స్వామివారి లడ్డూ వేలంపాటలో రికార్డు స్థాయిలో రూ.3,56,555 ధర పలికింది. ఈ లడ్డూను మహేశ్వరం యజ్ఞమాచారి, మారోజు అభిలాష్ చారి, మారోజు సతీష్ చారి దక్కించుకున్నారు. అలాగే స్వామివారి శాలువా వేలంపాటలో మల్లికంటి వంశీ మీన రూ.39,999లకు పాడుకున్నారు. యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన శ్రీరామ అనుష 'హీరో డెస్టినీ' స్కూటీని గెలుచుకున్నారు. శోభాయాత్రలో మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్‌పర్సన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, మాజీ



కౌన్సిలర్లు మోటే రజిత రాజు, చేరాల నరసింహ, గునిగంటి మల్లేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు చేరాల కిరణ్ కుమార్, గౌరవాధ్యక్షులు వంగూరి బాలకృష్ణ, మాజీ అధ్యక్షులు, కార్యవర్గ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటికి సన్నబియ్యం.. కాంగ్రెస్‌తోనే సాధ్యం

**వేలిముద్రల గోసకు చెక్ పెడుతూ స్మార్ట్ కార్డులు**

**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే ప్రతి పేదింటికీ సన్నబియ్యం అందించడం సాధ్యమైందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులైన మహిళలకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పాలన సాగిస్తోందన్నారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. నేడు ప్రజా పాలనలో కొత్త కార్డుల మంజూరుతో పాటు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. రేషన్ దుకాణాల్లో వేలిముద్రలు



పడక మహిళలు పడే అవస్థలను తొలగించేందుకే చిటికెలో పనిచేసేలా ఈ స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్‌పర్సన్ కొయ్యడ రజని శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్లు పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మదర్ డెయిరీ రేసులో 'లావణ్య' జయభేరి

**- రాజపేట నుంచి తొలి మహిళా డైరెక్టర్‌గా ఘనవిజయం**

**- 190 ఓట్ల మెజారిటీతో విజయం సొంతం**

**తొలివెలుగు, రాజపేట :** నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) డైరెక్టర్‌గా రాజపేట మండలం పారుపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఛైర్మన్ చీర లావణ్య మహిపాల్ ఘనవిజయం సాధించారు. రాజపేట మండలం నుంచి మదర్ డెయిరీకి డైరెక్టర్‌గా ఎన్నికైన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. హయత్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన పాలకవర్గంలోని మూడు డైరెక్టర్ స్థానాల ఎన్నికల్లో రెండు స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు గెలుచుకోగా, ఒక స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. జనరల్ మహిళా కేటగిరీ డైరెక్టర్ స్థానానికి పోటీ చేసిన చీర లావణ్య మహిపాల్ 190 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన గెలుపునకు సహకరించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సొసైటీ ఛైర్మన్లు, పాల ఉత్పత్తిదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాడి రైతుల సంక్షేమం, డెయిరీ అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. లావణ్య విజయం పట్ల బీసీ



నేత జూకంటి ప్రవీణ్, పారుపల్లి సర్పంచ్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# పోషకాహారంతోనే తల్లి, బిడ్డలకు పరిపూర్ణ ఆరోగ్యం

**- అంగన్వాడీ సెంటర్లో వేడుకగా సామూహిక శ్రీమంతాలు**

**- పాల్గొన్న సర్పంచ్ పెరమాండ్ల మహాలక్ష్మి, ఉప సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్**

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** పోషకాహారం తీసుకోవడం ద్వారానే తల్లి, బిడ్డల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని పిల్లాయిపల్లి సర్పంచ్ పెరమాండ్ల మహాలక్ష్మి దానయ్య, ఉప సర్పంచ్ బందారపు లక్ష్మణ్ గౌడ్ అన్నారు. పోషక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పిల్లాయిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. సరైన ఆహార అలవాట్లతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, పుట్టబోయే పిల్లలు దృఢంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు ఎం. శోభ, మంజుల, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# యక్షగాన కళాకారుడు రామ నరసయ్యకు అశ్రునివాళి

**- కూరెళ్లలో నివాళులర్పించిన తోటి కళాకారులు**

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** మండల పరిధిలోని కూరెళ్ల గ్రామానికి చెందిన ప్రముఖ యక్షగాన కళాకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి గడ్డం రామ నరసయ్య చిత్రపటానికి తోటి కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందగా, వారి అకాల మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. రామ నరసయ్య మృతి యక్షగాన రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గడ్డం రాజలింగం, గడ్డం స్వామి, గడ్డం సుదర్శనం, గడ్డం నాగభూషణం, గడ్డం వెంకటాద్రి, శ్రీనివాస్, చక్రపాణి, భిక్షపతి, రమేష్, నరేష్, చంద్రమౌళి, పాండురంగం, శ్యాంసుందర్, నరేందర్, శౌరీ, అమరేందర్, ప్రవీణ్, రాంబాబు, గణేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.





## కలహాలు రేపిన కాపురం.. వివాహిత బలవన్మరణం

- మనస్తాపంతో ఉరేసుకున్న పసుపుల మమత
- మల్లగూడెంలో తీరని విషాదం
- అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులు

**తొలివెలుగు, రాజపేట :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజపేట మండలం మల్లగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పసుపుల మమత (28), ఆమె భర్త మల్లేశం రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం ఉదయం కుటుంబ సమస్యల కారణంగా మమతకు కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. ఈ విషయాన్ని పెద్దల సమక్షంలో మాట్లాడుకుని పరిష్కరించుకుందామని భావించారు. అనంతరం ఇంటికి వెళ్లిన మమత, తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె అత్తమామలు మరో గ్రామంలో వ్యవసాయ తోటలో పనిచేస్తున్నారు. ఘటనపై రాజపేట ఎస్సై తక్కియుద్దిన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలి

- యశోద నగర్‌లో పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రాగుల

**తొలివెలుగు, వనస్థలిపురం :** రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, కాలనీవాసులకు అసౌకర్యం కలగకుండా నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని యశోద నగర్ కాలనీలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీలోని రోడ్ నంబరు 5, 6, 7లలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్, జీహెచ్ఎంసీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, జీహెచ్ఎంసీ ఏఈ విఘ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, యశోద నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.




# నేతన్నల సంక్షేమమే ధ్యేయం




- ?రూ.190 కోట్ల త్రిఫ్ట్ ఫండ్ చెల్లించిన ప్రజా ప్రభుత్వం
- ?పోచంపల్లి సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని డై హౌస్‌లో సోమవారం నిర్వహించిన చేనేత సహకార సంఘం 71వ వార్షికోత్సవం, 68వ సర్వసాధారణ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చేనేత కార్మికులకు అత్యధికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.190 కోట్ల త్రిఫ్ట్ ఫండ్ నిధులను విడుదల చేసి కార్మికులకు చెల్లించామని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో చీరల ప్రదర్శన ఏర్పాటు చేసి రూ.10 కోట్లకు పైగా వ్యాపారం జరిగేలా తోడ్పాటునందించామని తెలిపారు. పోచంపల్లి చేనేత సహకార సంఘానికి రూ.2 కోట్లకు పైగా క్యాష్ క్రెడిట్ ఆమోదించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీనివల్ల కార్మికులకు నిరంతరం ఉపాధి దొరుకుతుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో వస్త్రాల ఎగుమతే లక్ష్యంగా నూతన డిజైన్లను రూపొందించాలని కళాకారులకు సూచించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్‌పర్సన్ కొయ్యడ రజని శ్రీనివాస్ గౌడ్, ఎన్డీసీసీబీ మేనేజర్ ఇందిరా ప్రియదర్శి, మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మాజీ బోర్డు డైరెక్టర్ కర్నాటి ధనంజయ, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, సహకార సంఘం ప్రధాన కార్యదర్శి సురపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సీత శ్రీశైలం, కోశాధికారి కోడి బాలరాజు, డైరెక్టర్లు కడివేరు చంద్రమౌళి, గంజి బసవలింగం, మేనేజర్ రుద్రాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ డెయిరీ ఎన్నికల వేళ ఉద్రిక్తత

- రెండు స్థానాల్లో కాంగ్రెస్.. ఒక చోట బీఆర్ఎస్ గెలుపు
- సమావేశంలో చెలరేగిన రగడ.. మైకులు ధ్వంసం
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

**తొలివెలుగు, హయత్‌నగర్ / రాజాపేట :** నార్మూల్ మదర్ డెయిరీ పాలకవర్గంలో ఖాళీగా ఉన్న మూడు డైరెక్టర్ స్థానాల ఎన్నికల్లో రెండు స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు, ఒక స్థానాన్ని బీఆర్ఎస్ మద్దతుదారు గెలుచుకున్నారు. సోమవారం హయత్‌నగర్‌లోని ఎస్.వి. కన్వెన్షన్‌లో ఈ ఎన్నికలు జరిగాయి. రెండు జనరల్ స్థానాల్లో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి (కాంగ్రెస్), దొంతిరి సోమిరెడ్డి (బీఆర్ఎస్) విజయం సాధించగా, మహిళా జనరల్ స్థానం నుంచి చీర లావణ్య (కాంగ్రెస్) గెలుపొందారు. ఆఖరి నిమిషంలో అధికార పక్ష మద్దతుతో బరిలోకి దిగిన గూడూరు శ్రీధర్ రెడ్డి ఓటమి పాలయ్యారు.

**సభలో నెలకొన్న ఉద్రిక్తత:**

ఫలితాల అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డెయిరీ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... రూ.70 కోట్ల నష్టాల్లో ఉన్న మదర్ డెయిరీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చొరవతో సీఎం రేవంత్ రెడ్డి ఎన్డీడీబీకి ఎన్ఓసీ ఇప్పించారని, దీంతోనే రైతులకు పాల బిల్లులు చెల్లించడం సాధ్యమైందని తెలిపారు. ఈ క్రమంలో డెయిరీ మాజీ ఛైర్మన్ శ్రీకర్ రెడ్డి వర్గీయులు అడ్డుతగిలి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు మైకులు విరగ్గొట్టుకుంటూ తోపులాటకు దిగాయి. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం విజేతలకు పాలకవర్గం అభినందనలు తెలిపింది.



తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..


# వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- రూ.40 లక్షల డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని వినతి**



**తొలివెలుగు, గడ్డిఅన్నారం :** మధురపురి కాలనీ రోడ్డు నంబరు 2 వద్ద వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు మధురపురి మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో (ఐఏఎస్)ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.40 లక్షల అంచనా వ్యయంతో 600 ఎంఎం స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైనప్పటికీ, ఇప్పటివరకు శాంక్షన్ మరియు టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయని తెలిపారు. కాలనీవాసుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు సంజయ్ జాదవ్, జాజు, సైకాంత్, ఖలీం, విజయ్ భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ జీతాలు చెల్లించాలి

**- వలిగొండ ఎంపీడీవో ఆఫీస్ ఎదుట కార్మికుల ధర్నా**

**- 10 నెలలుగా వేతనాల్లేక అల్లాడుతున్న అదనపు కార్మికులు**

**- అధికారులకు వినతిపత్రం అందజేత**




**తొలివెలుగు, వలిగొండ :** మండలంలోని 37 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, మల్టీపర్పస్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. మండలంలో పనిచేస్తున్న 60 మంది అదనపు కార్మికులకు 10 నెలలుగా, మల్టీపర్పస్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ఇచ్చిన శానిటేషన్ కిట్లు తప్ప, ఆ తర్వాత మళ్లీ ఇవ్వకపోవడంతో కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. అలాగే గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి కార్మికునికి ఇస్తామన్న రూ.2 వేల భత్యాన్నీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కొండే నరసింహ, కార్యదర్శి ఉక్కుర్తి రాములు, ఎడవెల్లి ఎల్లమయ్య, చూడారం మధు, కందుల లింగస్వామి, పావురాల శీను, పగడం లక్ష్మయ్య, అంజయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు**

**- ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలని ఎల్లంకి మహేష్ పిలుపు**

**తొలివెలుగు, వలిగొండ :** దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన అమరవీరుడు భగత్ సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎల్లంకి మహేష్ పిలుపునిచ్చారు. వలిగొండ మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు కనకబోయిన ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ... బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ఉరికంభాన్ని ముద్దాడారని స్మరించుకున్నారు. నాటి త్యాగాల స్ఫూర్తితో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు నేటి తరమంతా చైతన్యవంతం కావాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక నియోజకవర్గాల సవరణల పేరుతో కోట్ల మంది ఓటర్లను తొలగిస్తూ ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల అధికారి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు పోలపాక యాదయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసింహ చారి, ఏఐటీయూసీ నాయకులు బోడిగె సుదర్శన్ గౌడ్, మామిడికాయల నరేష్, ఇంజమూరి సాయిలు, ఎడవల్లి వేణు, శ్యామల నరేందర్, ఎక్కలదేవి విజయ్, యాట నరసింహా తదితరులు పాల్గొన్నారు.




# ఆవిర్భావ వేడుకల విజయం.. ఉద్యమకారుల కృషికి ఫలితం

**- హామీలు నెరవేర్చి ఆత్మగౌరవాన్ని కాపాడాలి**

**- ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి**



**తొలివెలుగు, వలిగొండ :** యాదగిరిగుట్టలో నిర్వహించిన ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన ఉద్యమకారులకు కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చి వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

# 29న జరిగే సమ్మేళనంతో 'ఎమ్మార్పీఎస్'కు సంబంధం లేదు

**- త్వరలోనే ప్రజాప్రతినిధులకు సన్మానం**

**- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోయ బాలరాజు**

**తొలివెలుగు, రాజపేట :** ఈ నెల 29న కొందరు నిర్వహిస్తున్న సమ్మేళనం కార్యక్రమంతో ఎమ్మార్పీఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘం రాజపేట మండల అధ్యక్షుడు కోయ బాలరాజు స్పష్టం చేశారు. సోమవారం రాజాపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీలు ఏర్పాటవుతున్న సమయంలో జాతీయ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి కొంతమంది కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో 32 ఏళ్ల పోరాటంతో సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలితాలు అందుతున్న వేళ, మాదిగల ఐక్యతను దెబ్బతీసేందుకు సమ్మేళనం పేరుతో చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. జాతీయ పెద్దలు, మాదిగ బిడ్డలు ఈ కుట్రలను గమనించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో త్వరలోనే మాదిగ, ఉపకులాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులకు ఘనంగా సన్మాన కార్యక్రమం చేపడతామని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

